కథానిక :

# స్వంత ఇల్లు

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

ఎవరయినా మనస్తత్వ పరిశోధకుడు ఫ్రీఏసోసియేషను మెథడు ప్రకారం (అంటే ఏదో ఒక మాట చెప్పి, వెంటనే తడుముకోకుండా ఏమాట నోటికివస్తే అది చెప్పడం) నన్ను పరీక్షిస్తూ 'చలమయ్యపంతులు' అంటే, తక్షణం నా నోటివెంట వచ్చేమాట 'స్వంత ఇల్లు'. అంతేకాదు, జామెట్రీలో థీరమూ (సిద్ధాంతము) దాని కాన్వెర్సు (వ్యతిరేక సిద్ధాంతము) కూడా చాలా సందర్భాలలో నిజమయినట్టు, "స్వంతఇల్లు" అన్నమాటవిన్నా నాకు వెంటనే స్ఫురించేమాట 'చలమయ్య పంతులు' అనే. అంతగా అవి నా భావసంబంధం కలిగి ముడిపడి ఉన్నాయి నా మెదడులో. ఈ రెండు మాటలున్నూ. కాబట్టే నేను ఇంత కాలమాయి, ఏదో యథాశక్తి డబ్బు ఆర్జిస్తూ, ఖర్చుపెడుతూ కూడా స్వంతఇంట యజమానిని కాలేకపోయే నేమో. అంటే ఆర్థికమయిన అశక్తి ఎల్లాగూ ఉందిగాని, దానిని అతిక్రమించడానికి తగినంతటి సంకల్పబలమూ, నిర్వహణ దీక్షా లభించకపోవడానికి కారణాలు జేరీజు వేసుకొని చూస్తే 'చలమయ్య పంతులు' 'స్వంత ఇల్లు' అన్న మాటలకి సంబంధించిన స్పష్టాస్పష్ట భావ పరంపరకి ఉంచుకొన్న స్థానం ఏమీ స్వల్పమయినది కాదు. అసలిప్పుడిది రాయడానికి పూనుకోడం కూడా, ఆ రెండు మాటలకీ నా మెదడుకీ ఉన్న అనవసరపు లావాదేవీలను ఎల్లాగో పరిష్కరించుకొని, ఎప్పటికయినా ఒక స్వంత ఇంటిదారుణ్ణి (ఇంటివాణ్ణి కాదు, అదయి చాలాకాల మయింది) కావాలనే సదుద్దేశంతోనే.

ఒకే సంఘటన ఒక్కొక్కరికి వాళ్ల దృక్కోణాల భేదంవల్ల ఒక్కొక్క విధంగా అర్థం కావచ్చునన్న విషయాల్ని నాకు చిన్నతనంలోనే ఒక మాదిరిగా అర్థమయేలాగు చేసినకీర్తి చలమయ్య పంతులుకీ ఆయన స్వంతయింటికీ దక్కవలసిఉంది.

నేను పుట్టినది ఆ యింట్లో కాదటగాని, నేను మనుష్యులనూ, వస్తువులనూ జ్ఞాపకం చేసుకోగలిగినంత మట్టుకు ఆ యింటికి సంబంధించనివి లేవు. నా రెండవయేడు వెళ్లి మూడవఏడు వస్తూండగా ఆ యింట్లో ప్రవేశించారట మావాళ్లు.

అప్పటినుండి ఆ యింటినిగూర్చి నేను ఆడిన మాటల్లోనూ, తలచిన తలపుల్లోనూ 'మా యిల్లు' అన్న స్వకీయమయిన ధోరణితప్ప వేరేమీ ఉండేది కాదు. రానురాను ఏడెనిమిదేళ్ల వయస్సులో, ఇళ్ళల్లో అద్దెయిళ్ళూ స్వంతయిళ్లూ అంటూ ఉంటాయనీ, అద్దె యిళ్ళలోవాళ్లు, ఇళ్ల స్వంతదారుల ఇష్టాయిష్టాలనుబట్టి నడుచుకోవలసి ఉంటుందనీ, చూచాయగా తెలియడమేకాగు, మా యిల్లుకూడా అద్దెదేకాని స్వంతంకాదని తెలిసినా, రెంటికీ పెద్ద భేదం కనిపించేదికాదు. మనం ఉండడానికి బాధ లేనప్పుడు ఇల్లు ఎవరిదైతే మనకేం అని. అసలు లోపల్లోపల మా యింటినిమాత్రం, అద్దెదయినా, మేముఎన్నటికీ విడిచిపెట్టవలసిన అవసరం వస్తుందన్న ఊహ సైతం వచ్చేదికాదు.

సామాన్యంగా చిన్నతనంలో ఒక ఊరినుండి ఇంకొక ఊరువెళ్లడమన్నా, ఒక ఇంటినుండి ఇంకొక ఇంటికి మారడం అన్నా ఎంతో ఉత్సాహం కలుగుతుంది; నాకూ కలిగి ఉండవలసిందే కాని అందుకు ప్రతికూలంగా కొన్ని కొన్ని పరిస్థితులు ఏర్పడ్డాయి. లేకపోతే నాపన్నెండవ పుట్టినదినం జరిగిన వారంరోజులనాడు మేము ఇల్లు మారవలసి వచ్చినందుకు నేను అంతక్లేశపడి ఉండకపోదును.

మా యింట్లో, అంటే చలమయ్యపంతులు గారి స్వంతయింట్లో ఒక అద్భుతమయిన జామిచెట్టు ఉండేది. చెపితే మీరు నమ్మరు, అసలిప్పుడు నేనే నమ్మలేకుండా ఉన్నాను, ఆ చెట్టు పళ్లూ వేరే ఏపళ్లు లేనంతటి తీపిని కలిగిఉంటాయని. అయినా అప్పుడు మరి నాకు ఇప్పటివంటి సంశయగ్రస్తమయిన జ్ఞానం లేదుకదా, నమ్మినదేదో హృదయపూర్వకంగా నమ్మడమే. సరే మీరూ, పూర్తిగా కాకపోయినా, ఇప్పటి నామాదిరిగా అయినా, ఆచెట్టు పళ్లు, తక్కిన చెట్లమాటకేం, చాలా మధురమయినవి అని ఒప్పుకోండికి ఏమీ అభ్యంతరం లేదనుకొంటాను.

అసలు నాకు ఆ చెట్టంటే ఉండే అభిమానం కేవలం దాని పళ్ళతీపికి సంబంధించినదే కాదు; చిన్నతనంలోని స్నిగ్ధమయిన స్నేహమే కారణమనుకుంటాను. మేము ఆ యింటిలో ప్రవేశించేసరికి అది ఇంకా బాగా కాపుపట్టని చిన్న మొక్క. దాని సంరక్షణ బాధ్యత యావత్తూ మా చిన్నక్కయ్య తనమీద వేసుకొంది. నాకు కొంచెం బాగా మాటలు అర్థంచేసుకోడం వచ్చిన దగ్గరనుండీ, మా అక్కయ్య నాచేత ఎన్నో నాకు ఇష్టంలేని పనులను చేయించ గలిగేది. ఆ చెట్టును తనతోపాటు అత్తగారింటికి తీసుకొని పోకుండా, నాకోసం ఉంచివేసే షరతు మీద. అటువంటి చెట్టును విడిచిపెట్టడం అంటే అంత తేలికయిన పనా?

అంతే కాదు, మా పెరట్లో పెద్ద మామిడి చెట్టొకటి ఉండేది. దాని కొమ్మలు కేవలం మాకోసమే పుట్టినయ్యన్నట్టు, నేలకి అయిదారడుగుల ఎత్తున సమానాంతరంగా ఉండేవి; చక్కగా నిలబడి పరుగెత్తడానికి వీలుగా. నేనూ మా మేనల్లుళ్లిద్దరూ, (మా పెద్దక్కయ్య కొడుకులు. ఒకడు నాకంటె ఒక సంవత్సరం పెద్ద, ఇంకొకడు ఒక సంవత్సరం చిన్న) ఇంకా మా వీధిలోని మరి అయిదారుగురు సహాధ్యాయులూ కలిసి, కోతి కొమ్మచ్చి ఆటలో, వేసవి కాలపు రెండు నెలల శలవులీ రెండున్నర రోజులుగా గడిపేసే వాళ్లం. శివరాత్రికి చింత పిక్కంతే, అంటారు మామిడి పిందెలగురించి. మా చెట్టు కంది గింజలంతేసి పిందెలు పెట్టినది మొదలు శివరాత్రిలోపుని అంత చెట్టునీ, చిట్టచిగురు కొమ్మని సైతం ఒక్క పిందయినా మిగలకుండా దూసేసేవాళ్లం. అయితే పెద్దదయిఉండేవరకు ఉన్నా, భరించరాని పులుపు గనక మా వాళ్లుకూడా ఏమీ అనేవారు కారు. ఒక వేళ అన్నా లక్ష్యపెట్టి ఉండేవాళ్ళం కామనుకోండి

అక్కడితో ఆగినా బాగుండును. నా కాయింటితో అనుబంధాన్ని మరీ బలపరచే ఇంకొక అంశం కూడా ఉంది. 'మా యింట్లో, నాగదిలో (మా అన్నయ్య పెద్ద చదువుకి వెళ్లిపోయేక వాడికి శలవులేని కాలం వాడిగది నా చదువు గదిగా ఉపయోగపడేది) మేము స్థాపించిన "వేణుగోపాల్ సినీమా థియేటరు" మాట ఏమిటి చెప్పడం? మేము మామూలు సినీమా థియేటర్లలాగ పూర్తిగా అధునాతన నాగరకతలో పడక, సినీమాలతోపాటు ప్రాచీన నాగరకతా సూచకంగా 'చర్మనాటకాలు' (తోలుబొమ్మలాటకి అప్పుడేదో గొప్ప పేరుగా అంటూ ఉండేవారు) కూడా ఆడిస్తూ ఉండేవాళ్లం. అసలు మా బొమ్మలన్నీ అట్టముక్కలతో చేసినవే అయినా తక్కిన అన్ని లక్షణాలూ ఉన్నాయి గనుక మాదిమాత్రం తోలుబొమ్మలాట కాకతప్పదుకదా!

సరే, ఇంతమాత్రంలో మురిగిపోయిందేమిటి, ఇంకొక యింటిలోమాత్రం ఈ వ్యవహారాలు జరిపించకూడదా అంటారేమో. అక్కడ ఇంత ప్రత్యేకంగా ఇంట్లోని పెద్దవాళ్లతో సంబంధం లేకుండా ఒక గది ఉండొద్దూ? ఉంటేమాత్రం.........

ఒకమారు మా నాన్నగారి స్నేహితుడు చంద్రశేఖరంగారని ఆయన మాఊరు ఏదో పనిమీద వచ్చి ఒక వారంరోజులున్నారు. ఆయన గీసిన చిత్రాలు అప్పుడప్పుడు పత్రికల్లో వస్తూఉండేవి. అవి చూసి మావాళ్ళంతా ఎంతో గొప్పగా చెప్పుకొని, ఇంటికి వచ్చిన పెద్దవాళ్లందరికీ చూపించేవారు. నిజం చెప్పవద్దూ, నాకుమాత్రం అవేమిటో అలికేసినట్లుగా, వంకలు వంకలుగా ఉన్నట్లుండేవి. అంతకంటె మా హైస్కూలు డ్రాయింగుమాష్టరుగారు గీసే బొమ్మలు ఎంతో ముచ్చటగా ఉండేవి. అయితే మావాళ్లు, మీ మేష్టరుగారు వంటి వాళ్ళ బొమ్మలకంటె, ఎంతో గొప్పవి చంద్రశేఖరంగారి బొమ్మలంటే నమ్మాలని ఉండేదికాదు.

ఆయన ఒకనాడు మధ్యాహ్నం నిద్ర పట్టక ఊసుపోక, మా కళాప్రదర్శనాన్ని విలోకించడానికి

ఏతెంచేడు. చూసి, చూసి, చివరకు, "ఏమోయి సూర్యం, మీ సినీమాధియేటరు పేరేమిటి?" అన్నాడు. 'అదుగో చూడండి సార్, వేణుగోపాల్ సినీమా' అని గోడమీద నేను పెన్సిల్‌తో, రాసిన పేరు చూపించాను. ఆయన 'ఛా, ఇలా నీ హాలుంటే ఎవళ్లు చూడడానికి వస్తారు? నేను రాస్తాను పేరు' అన్నాడు. రంగులు లేకపోతే, నల్లసిరా, ఆకుపచ్చసిరా, నాదగ్గరున్నాయి. మా నాన్నగారి టేబిలుమీదనుండి ఎఱ్ఱసిరా తీసుకొని వచ్చాను. ఇంతా చేసి ఆయన పేరు అక్షరాలతో రాస్తారనుకొన్నాను.......తరవాత నేను పెద్దవాణ్ణయి చిత్రాల విలువలు కొంత తెలుసుకొన్నా ఆనాడాయన చిత్రించిన వేణుగోపాలుడి బొమ్మమీద ఉండే ప్రత్యేకాభిమానం పోలేదు. అప్పట్లో మా స్నేహితులందరి లెక్క ప్రపంచ చిత్రకారులందరిలోనూ చంద్రశేఖరంగారు అగ్రగణ్యుడు; ఆయన చిత్రాలలో మకుటాయమానమయినది మా సినీమాహాలు గోడమీద ఆయన చిత్రించిన వేణుగోపాలుడి చిత్రము. పరధ్యానంగా ఉంటే, బొమ్మలతోపాటు వేణువునాదంకూడా వినబడినట్టయేది మా చెవులకు. ఆ తరవాత బొమ్మలలోనూ నిజంగానూ, ఎన్నెన్నో ఆవులను చూసేను. కాని, అంత అందమైన ఆవులుమాత్రం మరి కనబడలేదు. కృష్ణుడలా మురళి మ్రోయిస్తూఉంటే, అతనికి కనబడకుండా, మనకి కొంచెం కనబడేలాగ, ఒక చెట్టు ప్రక్కను దాగొని వింటూండేది, రాధ. మరిన్ని మాటలెందుకు, మా ప్రదర్శనాలకు మేము నియమించుకొన్న కాణీ టిక్కట్టు కేవలం ఆ బొమ్మని తనివితీరా చూడ్డానికి ఇచ్చినా సబబే ననిపించేది. అటువంటి అద్భుతమయిన సినీమాధియేటరును విడిచిపెట్టి, ఇంకొక ఇంటికి పోవాలన్నప్పుడు, నాకు ఉత్సాహం కలకలేదంటే అందులో అసందర్భం ఏముంది?

మా ఆటపాటలంటే తరుచు మండిపడే మా నాన్నగారికికూడా అంత మంచి బొమ్మని విడిచిపెట్టడం కష్టంగానే తోచింది. కాని, ఆయన అట్టే విచారించనక్కరలేకుండా అదంతా నా తెలివితక్కువగానే జమకట్టేరు. "ఒరే సూర్యం, నువ్వు వెట్టి.వెధవవిగాని, ఆయన చంద్రశేఖరంగారు బొమ్మ రాస్తానంటే, అమ్మనడిగి ఒక మంచి తెరగుడ్డో, కేన్వాసుముక్కో తెస్తావుగాని, వట్టి గోడమీద బొమ్మ రాయించుకోడం ఏమిటి? ఇదేం మన స్వంత ఇల్లా? కాకపోయినా, నీ మొగంగాని, చదువూ సంధ్యా మానుకొని, సినీమాలు బొమ్మలాటలూ ఏమిటి?" అని వెళ్లిపోయేరు. నేను ఏమీ సమాధానం చెప్పకపోయినా, ఆయన చెప్పినంతగా నాలో తెలివి తక్కువ ఉందనిపించలేదు. కాక, అదివరకెప్పుడూ నేను ఆ యింటిని మరొకళ్ల యిల్లు అన్న దృష్టితో చూడనే లేదు. ఇన్నాళ్లు ఉండి, ఇప్పుడింతలా పుట్టిమునిగిపోయినట్టు మారిపోవలసిన అవసరం ఏమి వచ్చిందో నాకు అర్థంకాలేదు.

పైగా, మేము అవతల వెళ్ళవలసిన ఇంటిలో చెట్లమాట అటుండగా వీధిలోగాని, పెరట్లోగాని, సిమెంటుగచ్చు చేయబడని భాగం ఒక అంగుళం అయినా లేదు. ఇల్లంతా సన్నంగా ఒక పొడవు గొట్టంలాగుంది. నాకు వేరే గది ఎల్లాగూ లేదు. అయినా మా నాన్నగారికిమాత్రం ఆ ఇల్లు చాలా బాగానే ఉందిట. తన ఆఫీసుకీ, తక్కిన యింటికీ సంబంధం లేకుండా ఉండటం తనకు ప్రశాంతంగా పని చేసుకుందికి వీలుగా ఉంటుందట. ఆయన పని ఏమిటో అప్పుడు తెలియకపోయినా తరవాత తరవాత తెలిసింది. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ పజిల్సు సాల్వు చెయ్యడమూ, ప్రపంచంలోని గొప్పగొప్పవాళ్ల జాతక చక్రాలన్నీ వేసి ఫలితాలు రాస్తూ ఉండడమూ, ఇంకా ఇటువంటి మరికొన్ని పనులే ఆయన ముఖ్యమయిన ఆఫీసుపని అని తెలుసుకోగలిగేను. ఏమయితేనేం, అప్పటిమట్టుకు, నాన్నగారిపని పిల్లలగోలవలనగాని, ఆడవాళ్ల కబుర్లవల్లగాని చెడిపోకపోవడం చాలా ముఖ్యమయినదికదా. అంతే కాదు, మా నాన్నగారు చూసిన సదుపాయము. అప్పుడు మా యింటికి ఇస్తున్న అద్దెకంటె కొత్తయింటికి అయిదు రూపాయలు అద్దె తక్కువట. అంటే ఇప్పుడు హెచ్చిస్తామన్న అయిదూ, అక్కడ తగ్గిన అయిదూ కలిపి నెలకి పది రూపాయలు నెలకయే ఖర్చులో కూడిక జరుగుతుందని, మా అమ్మకి బోధపరిచేడు. అసలు మా అమ్మకి కూడిక చేయడం ఒకరు చెప్పనక్కరలేదు; అది ఆమెకు జన్మతః వచ్చిన విద్య.

ఆయా కారణాలవల్ల ఇల్లు మారడం నిశ్చయం అయిపోయింది. కాని, నాకు మాత్రం ఉండబట్టక,

అమ్మనడిగేను, మార్పునుగురించి. అప్పుడు అమ్మ చెప్పిన మాటలనుబట్టి నాకు మొట్టమొదట చలమయ్యపంతులును గురించి తెలిసింది. తెలియడమేమిటి, నాకు చలమయ్యపంతులుమీద కలిగినంతటి ఆగ్రహం కీచకుడిమీద భీముడికికూడా కలిగివుండదు. అయితే, ప్రదర్శించడానికి ఎదుట మనుష్యులు లేని, పరోక్షమయిన సాత్త్వికాగ్రహమయిపోయింది నాది.

కొత్తఇంట్లోకి మారిన తరవాత కూడా ఎటునించెటు చూసినా, నా ఆటపాటలలోని ఆనందాన్ని అపహరించిన నేరానికి నాకోపానికి గురికావలసిన మనిషి ఒక్క చలమయ్యపంతులే కనిపించేవాడు. ఏమంటే ఎంతగా అనవసరంగా చీవాట్లు పెట్టినా కట్టుఖాయిదా చేసినా అమ్మా నాన్నామీద బాగా కోపం తెచ్చుకోబడదుకదా; ఇక మరి నన్ను నా ఆటలనుండి, స్నేహితులనుండి దూరంచేసిన ఘోరపాతకానికి ప్రతిఫలంగా నా మనస్సులో నేను వేసిన ఎన్నెన్నో చిత్రవిచిత్రమయిన శిక్షలకు పాత్రుడు కాక తప్పేది కాదు చలమయ్యపంతులుకు.

అలా ఒంటరిగా కూర్చొని, నేను చదివిన, విన్న, కలల్లోనూ, చూసిన సినీమాల్లో నాయకులలోకి నేను పరకాయప్రవేశం చేసి, ప్రతినాయకులలోనికి చలమయ్యపంతులను ప్రవేశపెట్టి ఊహామాత్రంగా నడిపే కథలూ నాటకాలూ పూర్తి తృప్తి నివ్వలేకపోయేవి కదలిక అమితంగా కావలసిన ఆ వయస్సులో.

అప్పుడప్పుడు అన్నయ్య శలవులకి రాకపోతాడా, అప్పుడు వీడిపని పట్టించకపోతానా అని అనుకొనేవాణ్ణి. అంటే నా ఉద్దేశం మా అన్నయ్య, అనంత భుజబలశాలి కావడమే కాకుండా, నేనిలా సూచనమాత్రంగా అనేసరికల్లా ఎవరినంటే వారిని చితగ్గొట్టి వచ్చేస్తాడనీ—అంతేకాదు, మా అన్నయ్య అదివరకు శలవులకి వచ్చినప్పుడు అంటూ ఉండేవాడు, ఎవడో ఒక కాఫీహోటలు యజమానినిపట్టుకొని, వాళ్ల కాలేజీ పత్రికలో తెగ ఏకేసేనని. అదేమిటో నాకు స్పష్టంగా అర్థంకాకపోయినా, ఆశిక్ష ఏదో, ఈ చలమయ్యపంతులుకు ఎందుకు వెయ్యకూడదా అనీ. అప్పుడు అతను, పశ్చాత్తాపపడి చేసిన తప్పుక్షమించమనివచ్చి, మళ్ళీ, బాబూ మీరుహాయిగా మీయింట్లో ఉండండని అంటాడనీ ఎన్నెన్నో ఊహిస్తూఉండేవాణ్ణి.

అయితే ఇవన్నీ నన్ను నేను సమాధానపరచుకొందికి చేసే ఊహలే అని నాకూ కొంత తెలియకపోలేదు. మా వాడు వచ్చినా వాడితో ఇటువంటి సంగతులు మాట్లాడుతానా? వాడు పరీక్షలవగానే వాళ్ల స్నేహితుల ఊళ్లూ, మా పెద్దక్కయ్యగారి ఊరు, మా చిన్నాన్నగారి ఊరు అన్ని ఊళ్ళూ తిరిగి తిరిగి వచ్చేడు. వచ్చిన మర్నాడే వాళ్ల పరీక్షాఫలితాలు పేపర్లలో వచ్చేయి. వాడు, మరికొన్నాళ్లు రాకపోయినా బాగుండిపోవును. పరీక్షపోయినందుకు, మా నాన్నగారు అగ్నిరుద్రుడై పోయేరు. మావాడు కూడా ఏమీ తక్కువ వాడుకాదు. పరీక్షపాసయితేగాని యీ యింట్లో మరి అడుగుపెట్టనని కాగితం రాసి పెట్టి వెళ్లిపోయేడు. ఆ వెళ్లడం అంతే. మరి ఇంటికి ఉత్తరమయినా రాయలేదు. ఎవరినీ తెలియని కొత్త ఊరుకివెళ్లి, అక్కడ నానారకాల అవస్థలూ పడి, పరీక్షకి తయారయాడట. కాని, తీరా వేళకి బ్రహ్మాండమయిన జ్వరం. అయినా అలాగే వెళ్లి రాయడానికి ప్రయత్నిస్తే, కాలేజీ ప్రిన్సిపాలు బల్వంతంగా హాస్పిటలులో ప్రవేశపెట్టారట. మళ్ళీమారు పరీక్ష ఏమో రాశాడుగానీ, మరి మాయింటికి రాలేదు. అప్పుడు వాణ్ణి పరీక్షచేసిన డాక్టరుగారు క్షయ చాలా బాగా నాటుకొందని టెలిగ్రాము ఇస్తే, అమ్మా నాన్నా పరుగెత్తుకొని వెళ్ళేరు. కాని, అప్పటికి వీళ్లు వెళ్లి చేయగలిగినస్థితి దాటి పోయినది. తరువాత వాడు శానిటోరియంలో వీలయినంత బాగా ఉండడానికి మా నాన్నగారు ఏమాత్రమూ వెనుదియ్యకుండా ఖర్చుపెట్టేరు. ఆ పెట్టిన ఖర్చులో నాలుగవవంతు పరీక్ష నిమిత్తం వృధా అయిందని, బాధపడి, వాణ్ణి బాధపెట్టి ఉండకపోతే, వాడికి క్షయ వచ్చి ఉండేదికాదని నా నమ్మకం. చాలా మంచి పరిస్థితుల్లో ఉన్నవాళ్లకి కూడా సంపర్కదోషంవల్లగాని, వారసత్వంగాగాని, వ్యాధివస్తే రావచ్చును గాని, సరిఅయిన గాలి, వెలుతురూ, భోజనమూ విశ్రాంతి లేనివాళ్లకి మాత్రం ఇది ఏ స్వల్పసంపర్కంవల్ల నయినా అతి సులభంగా సంక్రమించగలదు అని డాక్టర్లు చెప్పేమాట నాకు నిజంగా వేదవాక్యమే.

మావాడు అలా పోయినతరవాత నా చదువు సంధ్యలను గురించిన కట్టు ఖాయిదాలు కొంతవరకు సడలేయి. మా నాన్నగారు ఏ కొంచెమో పూర్వపద్ధతిని నడపబోయినా మా అమ్మ పూర్తిగా నా పక్షాన ఉండేది. మానాన్నగారికికూడా లోపల్లోపల భయమే, నేను ఎక్కడ ఇల్లువిడిచి పారిపోతానని.

కట్టు ఖాయిదాలు సడలడం మూలాన, నా స్కూలు, కాలేజీ మార్కులు కొంత తగ్గడం తప్ప విశేషించి ఏమీ నష్టపోలేదని అనుకొంటున్నాను

వయస్సుకి తగిన స్నేహితులు లేకపోవడంవల్ల బలవంతంగా కలిగిన ఒంటరితనమూ, మావాడి అకాల మృతిని గూర్చిన వ్యథా, తరవాత కొంత కాలానికి నన్ను ఒక మాదిరి రచయితగా చేసే యనుకొంటాను. ఆ కొత్త ఉత్సాహంలో (ఉబలాటమే) మాఅన్నయ్య ఉండిఉంటే చేసి ఉండవలసపని, చలమయ్య పంతులు గారిని, ఆయన దౌష్ట్యాన్ని ప్రపంచానికి అద్దంలో చూపించినట్లు ప్రతిఫలించేలాగ చెయ్యాలని, అంటే అప్పుడు నేను అనుకొనే భాషలో, బాగా మరి తలెత్తుకోలేనట్లు ఏకాలని, ఎన్నెన్నో మార్లు అనుకొన్నాను. అయితే ఆ ఉబలాటాన్ని ఎలా నిగ్రహించుకోగలిగేనో నాకే ఆశ్చర్యంగా ఉంది. అయితే అందుకు కారణం ఒకటిమాత్రం స్పష్టంగా కనిపిస్తుంది. తక్కిన చిన్న చిన్న కథలలాగ నాటికలలాగ దాని విషయంలో నేను తృప్తిపడదలచుకోలేదు. అవతల అతగాడికి దుర్భరమయిన అవమానంకలిగించడమే కాకుండా, అతణ్ని గురించిన రచన. నారచనల్లో వాస్తవికతకీ, వ్యంగానికీ. ఆదర్శాలకూ, ఇంకా ఇంకా నేను వాంఛించే అన్నిటికీ మేలు బంతిగా ఉండాలన్న అత్యాశవల్లనే కథానికగా రాయాలనుకొన్నప్పుడు, అంతకంటె నాటకమయితే,సమర్థులయిన నటులు ఉచితమైన హావభావనిచేష్టలతో ప్రదర్శించినప్పుడు, పండితపామరులు యావన్మందికీ నేను ఇవ్వదలచిన సందేశాన్ని సక్రమంగాఇవ్వడం జరుగుతుందనిపించేది. తీరా నాటకం మొదలు పెట్టేసరికి, అందులో పాత్రల అంతర మనోభావాలనూ, సంఘర్షణలనూ విపులీకరించి రచయిత వ్యాఖ్యానం చెయ్యడానికి సావకాశం తక్కువ కావడంవల్ల, నాటకంకంటె కథే శ్రేష్ఠతరమని అనిపించేది. ఇంకా, మరికొన్ని సమయాల్లో ఈ అభిప్రాయాలనే కేవలం కథ, నాటకం అన్న బురఖాలు లేకుండా స్వచ్ఛమయిన వ్యాసరూపంలో ప్రకటించాలని కూడా అనుకోకపోలేదు.

తరవాత తరవాత ప్రపంచం నాకూ చలమయ్య పంపతులుకూ సంబంధించినదే కాక చాలా విశాలమయినదన్న అభిప్రాయం ఏర్పడిన తర్వాతకూడా, మా, అంటే, నా మనస్సులోని మాయిద్దరి మధ్యాగల విభేదము ఒక తరహానుండి ఇంకొక తరహాకి మారింది తప్ప, పూర్తిగా అంతరించిపోలేదు. ఇల్లులేని, ఇళ్లనుండి బలవతంగా వెళ్లగొట్టబడిన పీడిత తాడిత అధఃపతిత అద్దెయిళ్లనివాసుల ప్రతినిధిని నేను, డబ్బు సేకరణ తప్ప ప్రపంచమే లేని, క్షుద్ర, సంకుచిత, కఠిన కర్కశ గృహయజమానుల వర్గానికి ప్రతినిధి చలమయ్యపంతులు. ఇవి మా అంతస్థులు.

అంతద్వంధంగా అనుకోగలిగికూడా ఆరోజుల్లో నేను ఆయన్ను గురించి కథ రాయలేకపోయేను. ఇక ఇప్పుడు రాసి మరి ప్రయోజనం లేదని తెలిసి, ఏదో ఈవిషని బంధాన్ని తెంపుకోవాలన్నట్లుగా రాస్తున్నాను.

ఆయనగురించి, ఆయన ఇంటిని గురించి అనుకొంటూ ఉండడమే తప్ప, ఆయనతో నాకు వ్యక్తిగతంగా పరిచయం ఏమీలేదు; ఏదో రెండుమూడు మార్లు కలిసేను. అయితే, ఆ వెడల్పు తక్కువపంచ, ఆ ఒక ప్రక్క దారంకట్టిన సులోచనాలు, తనకంటె ముసలిదయిన కోటు—ఆయన్ని తెలియని వారెవరు గనక ?

ఆయన వక్తే కాదు, ఆయన ఇంటిలో దిగబోయే వారిని ఇంటికి ఉన్న సదుపాయాలగురించి ఒక్కొక్క అమరిక ఏర్పరచడానికి ఎంతెంతఖర్చు అయినది అన్నవిషయాన్నిగురించీ, ఆయన ఉపన్యసించే ధోరణికుండా చాలా మందికి సుపరిచితమే. ఏ కుమార్తె తండ్రికూడా తన కుమార్తె గుణగణాలను కాబోయే అల్లుడివద్దా అతడి బంధుసముద్రులవద్దా అంతటి పరవశత్వంతో వర్ణించిఉండరు; ఏ కవిపుంగవుడూ సానుభూతిమంతులయిన శ్రోతలవద్ద తన కావ్యంలోని పద్యాలను అంకంటె అభిమానంతో చదివి, అనక్తితో వాచ్యవ్యంగ్య పరమార్థాలను ఉద్బోధించిఉండడు; అంతటి తన్మయత్వం కలిగి

స్తుంది, చలమయ్య పంతులుకు తన స్వంత ఇంటిని గురించిన ప్రస్తావన. అవతలి మనుష్యులు ఇదంతా విని ఆనందిస్తున్నారా లేదా అన్నదానితో ఏమీ సంబంధం ఉండదు ఆ ధోరణికి; కొందరు కొందరు మహోపన్యాసకులు వేదిక ఎక్కేసరికి తమ చుట్టూ ఉన్న విశ్వాన్నే మరచి, శ్రోతల ఇష్టాఇష్టాలను అర్థం చేసుకొనే శక్తి నీకూడా లక్ష్యం చేయకుండా కేవలం ఉపన్యాసకళకోసమే అన్నట్టుగా ఉపన్యసించే పద్ధతికి కొంత దగ్గరగా ఉంటుంది ఆయన ధోరణి.

అయితే నిజానికి కూడా ఆ యింటివంటి వసతి గలది మా ఊళ్లో మరొకటి లేదనిపిస్తుంది. అంతకంటె బలమూ, దళమూ ఎత్తూ కలిగి, ఎక్కువ విలువచేసేవి చాలా ఉన్నాయి. కాని, ఎక్కువమంది పిల్లలూ పాపలూ కలిగిన గృహస్థులు హాయిగా జీవించడానికి మాత్రం దానితో సమానమయినది ఇంకొకటి లేదు అన్నమాట ఇప్పుడు నేననుకొంటున్నదే.

అయితే ఆయీ అంశాలు అందరికంటె బాగా చలమయ్యపంలుకే తెలుసును. ఆయన అంటూ ఉండేవాడు, "వెడల్ప గదుల కే ముందండీ, అంగుళం జాగా విడిచిపెట్టకుండా అంతా సిమెంటుగచ్చు చేసి, పిచికగూళ్లలాగు, జైలుగదులలాగ ఎన్నైనా, కట్టేవచ్చును. అంతలోనే సదుపాయమూ సౌఖ్యమూ వచ్చేమాటయితే, మన ప్రాచీనులలోనే కాదు ఇప్పటి పాశ్చాత్యులలో కూడా ఇంతగా వాస్తుశాస్త్రం అభివృద్ధి పొందడం దేనికి? మనపాటి గదులు కట్టడం తెలియకా, వాళ్లు అన్నిరకాల ప్లానులు తయారు చెయ్యడం?" అని. చలమయ్యపంతులుకి ఇంగ్లీషు కూడా వచ్చును. రావడమంటే ఆయన పూర్వపు మెట్రిక్యులేడు. కాగా, తత్ఫలితమయిన ఇప్పటి బియేలకంటె మాకే ఎక్కువ ఇగ్లీషు వచ్చు నన్న గర్వం కూడా ఆయనలో మిక్కుటంగానే ఉండేది. గర్వం మాటఎలాఉన్నా ఆయన, అవసరంవస్తే, అంటేఆయనకు కొంత ఉత్సాహంగాని ఉద్రేకంగాని కలిగితే మరి తెలుగు పనికి వచ్చేదికాదు; రాజభాష అయిన ఆంగ్లేయంలోనే పడపడపడ మాట్లాడేవాడు.

అయితే ఇంటిని మాపట్టే సమయంలోని ఆయన ప్రసన్నమూర్తిని చూసినవాళ్లెవళ్లూ ఆయన తలుచుకొంటే, బలవంతగా ఇంటిని ఖాళీచేయించే సందర్భాల్లో ధరించగల ఉగ్రమూర్తిని ఊహించలేరు.

తెలిసివాళ్లకి కూడా పోనీ, తరవాత ఏమయితేనేం, కొంతకాలం ఆ యింటిలో ఉండగలగడంచాలు నన్నట్లుపించేది. అసలు నేనే, ఆయిల్లు రెండువాటాలుగా ఇయ్యబడేయడల ఒక వాటా తీసుకొందామని ప్రయత్నించాను; కాని చలమయ్యపంతులు మాత్రం కంఠంలో ప్రాణంఉండగా మరి పదిహేను రూపాయలు, ఎక్కువఅద్దె రావడానికి సావకాశంఉన్నా, ఇల్లువాటాలు చేసి అద్దెకిచ్చే పద్ధతికి అంగీకరించలేదు. "నేను అది ఒక్కకుటుంబం ఉండానికి అన్న ఉద్దేశంతో కట్టేను, రెండువాటాలకి తగినట్లుగా కట్టండీ, ప్రజలని ఇరికించి బాధపెట్టడం నాకు ధర్మంగాతోచదు; నాకు ధర్మంగా తోచని పని నాచేతఎవ్వరూ చేయించలేరు" అంటూ ఉండేవాడు. అయనకేవలం డబ్బుదాహం మూర్తీభవించిన షైలాకు అనుకొందికి నాకుఇదే ఒక ప్రతిబంధకంగా ఉండేది. అంతేకాదు, ఒక్కొకప్పుడు పట్టులలకోసం ఒకటి రెండు నెల్లు ఇల్లుఖాళీగా అయినా ఉంచేవాడుగాని తనకి ఇష్టంలేని రకంవాళ్లు దిగడానికిగాని, తను ధర్మము అనుకొన్న అద్దెకు దమ్మిడీ తగ్గడానికిగాని అంగీకరించేవాడు కాదు.

* * *

చలమయ్య పంతులుకు మొదట్లో ఏ ఒకదాన్ని నమ్ముకొన్నా గడవదన్నట్టుగాఉండేవి, వారసత్వంగా సంక్రమించిన భూమిన్నీ, స్వయంశక్తివల్ల చేస్తున్న ఉదోగమున్నూ, భూమికోసం ఉద్యోగం విడిచిపెట్టబడదుకదా, అందులో ముందుముందు హెడ్‌క్లర్కు అయే సావకాశం కూడా ఉంటున్నప్పుడు. అలాగని ఇందులో కూరుకొని ఉండిపోతే, అక్కడ 'పండబారినపాల మెండబారక' పోయినా, ఎప్పటికంటె బాగానే పండుతున్నా, తనకి వచ్చేసిస్తు మాత్రం అతి సామాన్యుడయిన విద్యార్థికి పరీక్షలో వచ్చేమార్కుల శాతములాగే వచ్చేది.

అందుచేత అది అమ్మివేయడం నిశ్చయం. అయితే ఆడబ్బుతో ఏం చెయ్యడం? చాలా రోజులు ఆలోచించాడు. కంపెనీలు మొదలయినవాటిలో షేర్లయితే, కొనేవరకే గాని తరవాత మన ప్రమేయం ఏమీ ఉండదు. బాగుపడినా, చెడినా, మనకి మాత్రం

ప్రతినిత్యమూ మన ఆస్తిమీద హక్కు ఉన్నట్టు కనబడదు, కాక, అటువంటివన్నీ నడిపే, మనుష్యులకు లాభాలు చేకూర్చవే గాని, సామాన్యులకు వీటివల్ల పెద్ద లాభం ఏమీ ఉండదు. ఇక వడ్డీవ్యాపారం చెయ్యాలంటే అది బాగానే ఉంటుంది గాని, సమయాసమయాల్లో చాలా కఠినంగా ఉండవలసివస్తుంది; కాని, ఏమయినా మొండిపద్దులంటే కోర్టులకికూడా వెళ్ళవలసివస్తుంది; ఇంతా చేసి మానవదేహం శాశ్వతం కాదు, తాను రేపోమాపో హఠాత్తుగా గాని పోతే, రావలసిన పద్దులన్నీ సక్రమంగా వసూలు కావన్నది నిస్సంశయం.

ఇక, మన హక్కు ఎప్పటికీ పోకుండా, ఉందని ప్రతినిత్యమూ సాక్ష్యంగా కనిపిస్తూ, శాశ్వతంగా ఉంటూ, దానిమీద నెలనెలా జీతంలాగ కొంత నికరమయిన రాబడి వచ్చేందుకు అనుకూలమయిన పద్ధతి స్వంత ఇల్లుకట్టుకోడమే అనే నిర్ధారణకు వచ్చేడు.

ఇల్లుకట్టిచూడు, పెళ్ళిచేసిచూడు అన్నలోకోక్తిలో మొదటి దానిలో ఉన్న కష్టంలో దశాంశమయినా రెండవదానిలో లేదని చలమయ్య పంతులు విశ్వాసం. ఏమంటే అతడా విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాడు. ఇక మరెవరయినా తమ అనుభవాలు వేరేవిధంగా ఉన్నాయన్నా నమ్మే మనిషి కాడు చలమయ్యపంతులు. ఏదో ఒక కంటికి కనబడే వాస్తవికమయిన పరిమాణం అంటూ లేకుండా, మానసికములయిన అనుభవాలను అభిప్రాయాలను తూచి తారతమ్యం తెలుకోడం సులభంగా తేలేపనా? ఒకరికి బ్రహ్మాండంగా కనిపించేది ఇంకొకరికి అతిక్షుద్రంగా కనిపిస్తుంది. చలమయ్య పంతులు తన ముగ్గురు కొడుకులకీ, ఒక్క కూతురికీ పెళ్ళిళ్లు చేసేడు; గాని, ఆయా సందర్భాలలో పడిన శ్రమ అతనికి శ్రమ అని అనిపించనే లేదు.

కాని, ఇల్లుకట్టడంలో మాత్రం అంతసులువుగా బైటపడలేక పోయేడు. భూమిఅమ్మగా వచ్చిన డబ్బు, అదివరకుకొద్దిగా తాను నిలవచేసిన బాపతు స్థలంలోని, ఇల్లుకట్టడంపని సగంవరకు నడపడానికి మాత్రమే సరిపడ్డాయి. సగంలో అటూ ఇటూ కాకుండా విడిచిపెట్టిస్తాడా? పనిపూర్తిచేయలేక పోయేమన్న విచారానికితోడు నలుగురిలో అవమానం ఒకటి బాధపెడుతుంది కదా, పెద్దఎత్తుని ఇల్లు కడతానని బయలుదేరి, నిక్షేపంలా ఉన్నభూమి తగలబెట్టుకొన్నాడని ఎందుకూపనికిరాని చవటసైతం తన్ను హేళన చెయ్యారూ? ఇంకా అనుమానమేమిటి? ఈ పాటికి చేస్తూనే ఉంటారు, తాను ఇంటి పనిమధ్యలో ఆపుచేయించి నందుకు. అటువంటిది తాను ఇప్పట్లోపూర్తిగా విడిచిపెట్టుకొన్నా, లేక ఈ స్థితిలో అమ్ముకొన్నా ఆజన్మాంతమూ అవమానంతో క్రుంగి పోవలసిందే. ఒకపని ఆరంభించి మధ్యలో విడిచిపెట్టడం ఉత్తమ పురుషుల లక్షణం కాదు. సంశయాత్మా వినశ్యతి అన్నాడు. అయితే, ఇందులో తనకుఎటువంటి సంశయమూ లేదు. అంతా నిశ్చయమే. కాని, కావలసినదల్లాడబ్బు. అది లేందే పని కొనసాగించడమెలాగ? భార్య మెళ్ళోపుస్తెల నానుతప్ప మరేమీ లేదు; అది తీసేకంటే ఆత్మహత్యమేలు.

వీలయినంత మటుకు ప్రామిసరీనోట్లమీద డబ్బు తెచ్చి, మరికొంతకడుతున్న ఇంటినే కుదువపెట్టి తెచ్చి, మళ్ళీపని ఆరంభించాడు ద్విగుణీకృతమయిన ఉంత్సాహంతో.

"అప్పచేసి పప్పుఅన్నం తినగా నేసరా? ముందు సంగతి కాచుకోవచ్చు. ఇల్లుపూర్తయిన క్షణంలో నే అప్పులకింద అన్యాక్రాంతం కాకపోతే చెవి కదపా ఇస్తా" మన్నారు, దినదినమూ కొత్తగా రెండేసి నెవులుపుడుతున్నా కదపా ఇవ్వడానికి చాలనన్ని కబుర్లుచెప్పే సాహసికులు కొందరు. మరికొందరు సంస్కృత ప్రియులు ఋణంకృత్వాఘృతం పిబేత్ అన్నపద్ధతిని, పోనీ నెయ్యితాగిన తృప్తైనా ఉంటుంది. ఇలా శరీరమూ మనస్సూకూడా సున్నమయిపోయేలాగ పనిచేసి చేసి సాధించేదేమిటి? అంతే. కొందరు, హాయిగాకుడిచి కూర్చోలేక, కొరతను పడ్డట్టు, దారినపోతున్న గంప నెత్తికెత్తుకొన్నట్టు, ఇటువంటి తలవెంట్రుకలచిక్కు ఏదో ఒకటి పెట్టేసుకొని అది విప్పుకోలేక, నానా అవస్థా పడుతూ ఉంటారు. వాళ్ళకుమనం ఏం చెప్పినా లాభం లేదు. వాళ్లకు వాళ్లపనిలోనే ఆనందం కనిపిస్తుంది" అన్నారు.

మరికొందరు "కంపునోటివాడు గణిస్తే కమ్మనినోటివాడు అనుభవించేడని, విత్తొకడు వేస్తే ఫల

మొక డనుభవిస్తాడనీ అన్నట్టు, చలమయ్యపంతులు కేవలం కష్టపడ్డానికే పుట్టేడు; ఈ కష్టంయొక్క ఫలం ఎవ డనుభవించడానికి రాసి పెట్టిఉందో" అన్నారు...

ఆ యీరకపు విమర్శనలు చాలాభాగం అంతరించేయి, గృహప్రవేశంనాడు చలమయ్య పంతులు ధారాళంగా చేసిన సమారాధనతోనే.

కాని, అప్పటికీ ఇంకా కొందరు అనుమాన ప్రియులు లేకపోలేదు. "ఇప్పుడిలా వైభవం వెలిగించి నంతలో ఏముంది? ఈ చేసిన అప్పులు సక్రమంగా తీర్చుకొని, అప్పటికీ ఇల్లు నిలబెట్టుకోగలిగితే అదీ ప్రజ్ఞ" అన్నారు, లోపల్లోపల చలమయ్యపంతులు కొన్నాళ్లకయినా ఇల్లు అప్పులుతీర్చుకొనే నిమిత్తం అమ్మకోక తప్పదన్న నమ్మకంతో.

కాని, ఆవిషయంలోకూడా లోకుల ఊహలు అపోహలు కాక తప్పలేదు. అందువల్ల చలమయ్య పంతులు మీద కోపం తెచ్చుకోడానికి బదులు లోకం అతన్ని ఆదర్శపురుషుల్లో ఒకడుగానే లెక్క వేసింది.

ఆహారనిద్రాదులు సైతం అలక్ష్యంచేసి శ్రమించి, ఇంటికి సంబంధించిన అప్పులు తీర్చేడు. మొదట్లో ఇంటిమీద వచ్చే అద్దెమాత్రమే కాకుండా, నెలనెలా జీతంలో ప్రావిడెంటుఫండు నిమిత్తం కొంత వసూలు చెయ్యబడినంత నిక్కచ్చిగాను కొంత వేరే తీసి, ఒక అర్థపుష్కరంకాలంలో అప్పులన్నీ తీర్చేసి, ఇంటిని యద్విఘమయిన, అనుమానాలు లేకుండా స్వకీయం చేసుకొన్నాడు. మొదట్లో ఒక మాదిరి పిచ్చిగా చూడబడే చలమయ్యపంతులు ఇంటి మీది వితరీతాభిమానం తరువాత తరువాత ఒకమాదిరి విశిష్టగుణాల్లో ఒకటి క్రింద లెక్కకు వచ్చిందిలోకుల నోళ్లలో.

సంఘంలో గ్రహణవిముక్తరాకా శశాంకబింబ సదృశంగా ప్రకాశించగలిగిన చలమయ్యపంతులుకు, ఇంటిలోనే ప్రతిఘటన పొడసూపింది. కొంతకాలం తమలో తాము పరోక్షంగా అనుకొనే కొడుకులూ, భార్యా, బాహాటంగానే ఆయనను విమర్శించ సాగారు. పోనీ, అప్పులున్నంతకాలం అవి తీర్చడం అంటే తప్పని సరి. అయినా అవి మాత్రం ఎందుకు చెయ్యవలసివచ్చింది? మనశ్శక్తికీ, తాహతుకీ తగని పనులు మొదలుపెడితే ఎప్పుడయినా ఇంతే, పోనీ, అయిపోయిందేదో అయిపోయింది ఇన్నాళ్లూ పడ్డ కష్టం చాలదా? ఇంకా ఎన్నాళ్లూ ఎదురు చూస్తూ ఉండడం? ఇంటికీ ఒంటికీ చేస్తున్నకొద్దీ ఉంటూనే ఉంటుంది. ప్రతిసంవత్సరం వచ్చిన అద్దె కంటె ఎక్కువగా, ఏవేవో హంగులు, చేసి పెంచుతూ ఉంటే, దానికి అంతుఅంటూ మరి వుండనక్కర లేదా? ఈ ఇంటిని గురించిన వెట్టిలో సగంకొడుకుల చదువులమీద ఉండినా బాగుండును. అల్లా అయితే, ఈదరిద్రపు ఉద్యోగాలు పట్టుకొని దేవురించనక్కర లేకుండా ఇంకా బాగా చదువుకొని, మంచిఉద్యోగాలు చేసుకొందికయినా వీలుండేది ... అబ్బే, అసలు ఇంట్లో మనుష్యులెలాపోయినా బాధలేదు. ఎంతసేపూ ఇల్లు ఇల్లు ఇల్లు—అదొక వ్యసనమయి పోయింది. ఎప్పటికీ, ఆయింటి క్రింద ఖర్చుపెట్టడమే కాని, దానివల్ల అనుభవించేది మరేమీ ఉండదు కాబోలు"—ఇది, ఇంట్లోని విమర్శనా వైఖరి.

కాని చలమయ్యపంతులుమాత్రం చలించలేదు. "నా యిల్లు, నా యిష్టం, నా కెవళ్ళూ సలహా చెప్ప నక్కరలేదు" అన్నాడు.

అప్పటిమట్టుకు నోళ్ళు కట్టిపోయేయి. తరవాత కొన్నాళ్లకి గుసగుసలుగా ఆరంభించి క్రమంగా బైటికే అనగలిగేసేరు. కొడుకులు "అయితే భూమి అమ్మికట్టించినది కదా ఇల్లు అందులో మాకుమాత్రం వంతులేదా?" అని.

చలమయ్యపంతులు ఈమాట వినీ వినడంతో అగ్గిరుద్రుడైపోతాడనుకొన్నారుగాని, అటువంటిదేమీ లేదు; ఆ సాయంకాలమూ, రాత్రీ ఏమీ మాట్లాడకుండా ఊరుకొని, మర్నాడు భార్యను పిలిచి అతిశాంతంగా అరంభించాడు. "నిజమే, పితృపితామహార్జితమయిన భూమిలో వాళ్లకి కొంత హక్కుండి అది అమ్మి కట్టినటువంటి ఇంటిలో కూడా వాళ్లకి హక్కు లేకపోలేదు. అయితే, ఇంటిని కట్టడానికి అయినదాంట్లో ఎంత భూమి అమ్మగా వచ్చిందో, అంతా స్పష్టంగా లెక్కలు ఉండనే ఉన్నాయి. ఇక అందులో తక్కినదంతా నా స్వార్జితమేగాని మరొకటి కాదుకదా. నేను ఈ యింటికింద కాకపోతే, వాళ్ల చదువులక్రిందా పెళ్లిళ్లక్రిందా, ఆ భూమి కాస్తా అమ్మిఉంటే ఏ తగవూ లేకపోయేదన్న సంగతి వాళ్లకూ నీకూ

బాగా తెలిసిందే. బాగుంది, నా కెందుకీ ఘోష అంటే ఎలాగు? నేను చెబితే వాళ్లు, మేము పెద్దవాళ్ళ మయినామమ్మల్ని ఇంకా నాన్న తిడుతున్నా డను కొంటారు. నువ్వు నేను చెప్పినమాటలనీ శ్రద్ధగా గావిని, వాళ్లకి నెమ్మదిగా చెప్పాలి— అందుచేత ఉండే, వింటున్నావుకదూ, మరి నేనూ రిటైరయిపోదును కదా నాకూ మరి నెలజీతంఅంటూ లేదు. అందుచేత వాళ్లు, వాళ్లక్రింద నేను ఖర్చుపెట్టినదానికి, నాకేం వడ్డీ అక్కర్లేదు, అసలిచ్చేస్తే భూమి అమ్మగా వచ్చినడబ్బులో వాళ్లవాటాలు వడ్డీ సహితంగా ఇచ్చేస్తానని చెప్పు. అదంతా నీకెందుకు, ఎలాగో లాగు తెస్తాను డబ్బు - ఇల్లు అమ్మడం తప్ప గత్యంతరమే లేదా? ఏమో నా అనంతరం వాళ్లఖర్మం, ఎలా కావలిస్తే అలా ఏడవనీ, అంతేకాని, నా కంఠంలో ప్రాణం ఉండగామాత్రం ఆ ఇల్లమ్మతా నన్నది కలలోనివార్త. అంతగా వాళ్లకి దరిద్రం తగలడిపోతూ ఉంటే, ఈ తాతలనాటి ఇల్లు ఇది కాస్తా అమ్ముకొని అప్పులు తీర్చుకోమను. అంతేకాని, అదిమాత్రం అమ్మనుగాక అమ్మను. అయినా, అడిగేవాడు లేడుగాని, అప్పుడు నాజీతం ఎంతకనక. అందులోనే ఇంటిఖర్చులన్నీ సమకూర్చుకొనివచ్చి, పైగా వీళ్ల చదువు సంగల్యలకి, బోలెడేసి డబ్బుఖర్చు పెట్టేను. నేనేం, నా క్రింద ఎన్నడూ ఒక దమ్మిడీ దుర్వినియోగం చేయలేదు. ఆ యింటికింద వీళ్ళ తాతగారి ఆస్తి కలిసిపోయిందని వెధవ ఏడుపే గాని, దానిక్రింద నేను ఎంత కష్టపడ్డానో, అది తీర్చే ఒక్కడికీ గలగదేమి చెప్మా? పునాదులు తవ్వినదగ్గరనుండి దగ్గరుండి చేయించడమే కాదు, ఇద్దరు కూలివాళ్లకంటె ఎక్కువ పనిచేసేవాణ్ణి— ఏమిటీ? అందుకే నాకు అంత కష్టాన్ని కలిగించిన ఇంటిని అమ్ముకొందామూ? అబ్బబ్బ, ఏమి పితృభక్తి పరాయణులు. కాబట్టే, నాకీ ముసలికాలంలో ఏ కొంచెం తృప్తి మనశ్శాంతీ ఉన్నాయో వాటిని మూలచ్ఛేదం చేస్తున్నారు." అని మరి మాట్లాడలేక పోయాడు.

విశిష్టమయిన చిత్రాన్ని చిత్రిస్తున్నంతకాలం ఇంత మూల్యం వస్తుంది, అంతమూల్యం వస్తుంది. అని ఆశపడిన చిత్రకారుడికి చిత్రం పూర్తిఅయిన తరువాత, తాను కోరినదానికంటె, ఊహించినదానికంటె ఎక్కువ మూల్యం వచ్చినా చిత్రాన్ని విడిచిపెట్టడానికి కష్టం కలిగినట్టే, ఇంటిని అమ్ముకోడాన్ని గూర్చిన తలంపే బాధగా ఉండేది చలమయ్యపంతులకు. చిత్రకారుడికి తన అభిమానచిత్రాన్ని విడిచిపెట్టడం కష్టంగా తోచినా, ఇంకా ముమ్ముందు ఇంతకంటె ఉత్తమమయిన కళాసృష్టి చేయగలనన్న ఆశ ఉత్సాహము పట్టుదలా ఉంటాయి. కాని చలమయ్యపంతులకు అటువంటి సావకాశం ఏమి లేదే. ఒక బాహ్యవస్తువుమీద ఇంతగా మమకారం పెంచుకోడం పొరపాటే కావచ్చును కాని, తాను హఠాత్తుగా ఇప్పుడు మారిపోగలడా? కాకపోయినా ఇందుమూలంగా ఎవరికీవచ్చేనష్టం ఏమీ లేదే? పదేళ్ల క్రింతకంటే, చుట్టుపక్కల ఇళ్లధరలు మూడింతలు ఎక్కువయేయి. మరి పదేళ్లలో ఇంకా ఎంత హెచ్చుతాయో? ఎప్పుడయినా సరే స్థిరాస్థిని అమ్ముకొని, చరచర ఖర్చుపెట్టేస్తేమరి, మిగిలేదేమిటి? ఉన్నదానిని ఒక ఆకారంనుండి ఇంకొక ఆకారానికి మార్చుకోవాలి; అంతేకాని, పొదుగే కోసేస్తే పాలుంటాయా?

తరవాత మళ్లీ కొంతకాలం కొడుకు లేమీ అనలేదు.

క్రమంగా కానీ, తామే కొంత సర్దుబాటు మార్గానికి వచ్చే ఉన్నట్టుగా "అంతగా, తనకి అమ్మడం ఇష్టంలేకపోతేమాని పోయె. మా యిబ్బందులు ఎప్పుడూ ఉండేవే. అనుకని, తను చెప్పినట్టు, స్థిరాస్థి అమ్ముకోడం తెలివితక్కువే. అయినా, చుట్టూ పెద్ద బంగాళాలాగు అంతఖాళీజాగా ఎందుకు వృథాగా విడిచిపెట్టడం? అందులో ఏవో మాదిరి కుటీరాల్లాగ కట్టించినా చాలు ఇప్పుడు వచ్చే అద్దెకు, రెండింతలు వస్తుంది. డాబామీదకూడా, ఒక మూడో నాలుగో గదులు కట్టేసి, వాటాలుగా చేసి, ఎప్పటికయినా మూడువంతులు కావలసినదే కదా. అద్దెలకిస్తే, కావలసినంతఅద్దె వస్తుంది. మనకు అమ్ముకోడం, ఇష్టంలేనప్పుడు, దానిని మనకు లాభదాయకంగా చేసుకోవాలిగాని, ఇల్లా వృథాగావిడిచిపెట్టుకొంటే ఏంలాభం? ఒక్కరికిస్తే, ఎంతటివాళ్లకయినా అద్దె ఎక్కువయినట్లుగానే ఉంటుంది. ఆయన ఒప్పుకొంటే, ఏ మాసికలో పడి, డబ్బుతెచ్చి, పనులు మొదలుపెడతాము" అన్నారు పెద్దవాళ్లిద్దరూను. చిన్నవాడెప్పుడూ డబ్బు పంపమని రాయడమే తప్ప

ఇటువంటి గొడవ ఏమీ పెట్టుకోడు. ఏడిచేదాని మొగుడొస్తే నా మొగుడూ వస్తాడన్నట్టు, ఏమీ మాట్లాడకుండా సద్యఃఫలమేమిటో చూసుకోనేరకం, వాడిది.

ఈ రకపు ఇంటిని అభివృద్ధిపరచే పథకానికి వెనుకటంత బలంగా అడ్డునిలవలేకపోయేడు చలమయ్యపంతులు. ఆత్మాభిమానపూరితుడయిన యువకకవితో నీ పద్యంలో ఫలానా ఫలానాపదాలు వ్యాకరణ దుష్టములే కాదు, వ్యవహార దుష్టములు కూడాను. కాబట్టి వాటిని ఈ యీతీరులను సరిదిద్దుకోవలసింది" అని నిష్కర్షగా చెప్పినప్పుడు ఆ కవికి కలిగినంత కష్టం కలిగింది చలమయ్య పంతులుకు.

"మంచో, చెడ్డో, లాభమో, నష్టమో దానిగురించి, నా బ్రతుకంతా ధారపోసి నేను ఆనాటికి ఎంతో అందంగా నివాసయోగ్యంగా ఉంటుందనుకొన్న పద్ధతిని కట్టించాను. అది, ఈ నాటికి మీదృష్టికి బాగుండక పోవచ్చును. నిజంగానే, అది ఈనాటి అధునాతనపద్ధతులకు అనుగుణంగా లేకపోవచ్చును. దినదినమూ శాస్త్రము అభివృద్ధి చెందుతూనే ఉటుంది; కొత్తకొత్త పంపిణీలు వస్తూనే ఉంటాయి. అయినా, దానిని మార్పు చేయడం నాకెంత మాత్రం ఇష్టంలేదు. నేనూ ఇంక బ్రతికినంతకాలం బ్రతకనుకదా. ఎప్పటికయినా ఏమిటి, ఇప్పుడయినా అది మీదే. దానిని మీరు ఏవిధంగా ఉపయోగించుకొన్నా, అమ్ముకొన్నా పూచీలేదు. ఇన్నాళ్లు మీరు మీ యిష్టాలు కాదనుకొని, ఈ ముసలివాడి ఇష్టాన్ని గౌరవిస్తూవచ్చేరు ఈ అంశంలో. ఇంక మరొక నాలుగయిదేళ్ళకంటె ఎక్కువ ఉండను ఎంత ఆలస్యమైనా అంతవరకూ ఆగలేరా? మరి నేను చెప్పవలసిన దేదో చెప్పేను. పైన, మీ యిష్టం, అంతగా మీరు కాదు, తప్పదు అంటే అడ్డు తగులుతా ననుకోకండి మాత్రం" అన్నాడు.

బ్రహ్మాండమయన సన్నాహంతో, విపరీతమైన రణగుణధ్వనితో యుద్ధానికి వస్తాడనుకొన్న మనిషి, రాజీమాటలకు వచ్చేసరికి మరికఠినంగా మాట్లాడ్డానికి సావకాశం లేకపోయింది కొడుకులకు. "పోనీ ఆయనమాటే కాని అమ్మా, ఇన్నాళ్ళూ ఆయన మాటమీద నడిచి, ఇప్పుడు ఒక్కమారు తిరగబడ్డారని ఎందుకు; మరొక పది సంవత్సరాలలో మహా మనం చెడిపోయేది ఏముందిగనక? ఏమయినా, ఈ ముసలి కాలంలోని ఆయనతృప్తికంటేనా?" అన్నారు కొడుకులు.

అంతటి సామరస్యం కాకపోయినా, పరస్పర సహ్యభావం తండ్రికొడుకుల నడుమకుదిరి, రోజులు నెమ్మదిగా గడిచిపోతున్న సమయంలో, చలమయ్య పంతులుకు తగలవలసిన దెబ్బ కాదది.

రెండవకొడుకు వెంకటేశ్వర్లు కో ఆపరేటివు బ్యాంక్ సెక్రెటరీ. మొదట్లో తక్కినవాళ్ళిద్దరికంటె తక్కువగా ఉన్నాడనిపించినా, రానురాను వాళ్ళిద్దరికంటె తానే బాగుపడినట్టు కనిపించేవాడు. తక్కిన ఇద్దరూ కొత్తసైకిళ్ళు కొనుక్కోలేక ఆ పాత వాటితోటే అవస్థలు పడుతూఉంటే, తానొక సెకండుహేండు కారు కొనుక్కోగలిగేడంటే, అతని స్థితినిగురించి ఎవరయినా సంకోచించవలసిన అవసరం ఏముంటుంది?

అమాంతంగా అటువంటివాడు ఒక్కనాడు వచ్చిపడి,

"పదివేల రూపాయలయినా కావాలి, మత ప్రవేశమయినా కావాలి" అని కూర్చుంటాడని ఎవళ్ళనుకోగలరు? వాళ్ల బ్యాంకు డైరెక్టర్లు లోటు వచ్చిన పదిహేనువేలూ భర్తీ చేస్తే, పిల్లలవాడని కనికరించి ఊరుకొంటామన్నారట.

"ఏమయింది ఆ డబ్బు, పోనీ నువ్వు తినలేదు కదా, నీకేం భయం," అంటే "నాఖర్మం ఇలాగుంది. నే నేమయినా ఎవళ్లకీ అక్కర్లేదు, వెధవ క్రాసెగ్జామినేషనుకి మాత్రం లోటులేదు. నేను ఏ రైలు క్రిందో పడి చస్తే అప్పుడు చచ్చినట్లు నా పెళ్లాన్నీ పిల్లల్నీ పోషిస్తారు" అని, నెత్తి కొట్టేసుకొంటాడు.... మరి ఇల్లమ్మక గత్యంతరం కనిపించలేదు, చలమయ్య పంతులుకు.

అమ్మబోతే అడివి, కొనబోతే కొరివి అన్నట్టు ఎంత మంచి వస్తువయినా మనకు విపరీతమయిన అవసరంఉండి తొందరగా అమ్ముకోవాలంటే, ఖరీదు తక్కువ వస్తుంది. కాని, కొనదలచినవారిలో పోటీలురావడంమూలాన, ఆశించినదానికంటె ధర ఎక్కువగానే నిర్ణయమయినది కాని, ఆతృప్తిఅంతా తక్కినవాళ్లకే. ఎంత మంచి అల్లుడికిచ్చినాసరే, కూతుర్ని అత్తవారింటికి పంపేటప్పుడు తండ్రికి వచ్చేదుఃఖం

అంతా అతడికి పురోణీకాగితంమీద సంతకం పెడుతూఉంటే కలిగింది. తరవాత నెల్లాళ్లలోగా రిజిష్ట్రేషను జరిపించవలసిఉంది. కాని, చచ్చిఅయినా తన పట్టుదలను సాధించాడు చలమయ్యాపంతులు. రిజిష్ట్రేషనువేళకు అతను ఈ లోకపు అంచులనే దాటిపోయేడు.

ఒక ప్రత్యేకమయిన జబ్బూ అదీ ఏమీ లేదు. మామూలుగా ఉండే అతి నీరసమూ అంతే. ఆ వేళ డాబామీద పడకకుర్చీ వెయ్యమంటే, చలిగాలి వేస్తుంది వద్దని భార్య అన్నా లక్ష్యపెట్టలేదు. "అయితే మీరు వెయ్యకపోతే నేనే వేసుకోవాలి" అన్నమాటతో తప్పనిసరి అనుకొని, మనుమడు సుబ్రహ్మణ్యం కుర్చీ వేసి వచ్చి, నెమ్మదిగా పట్టుకొని మెట్లెక్కించేడు. డాబామీదనుండి, అవతలవీథిలోని, తను కట్టించిన ఇల్లు, తన స్వంతఇల్లు, మరొక్క నెల్లాళ్లలో పూర్తిగా తనకి కాకుండాపోయే ఇల్లును తనివితీరా చూస్తూ కూర్చున్నాడు. అంతే. అశ్వాసాంతమే. రాత్రి పాలుతాగమని, తీసుకొనివచ్చిన భార్యమాటకు మరి సమాధానం లేదు. కోట్లకొలది డబ్బు వ్యయించి, రెండు దశాబ్దులుపైగా అనేక వేలమంది శ్రమప్రయాసలకు ఫలితంగా కట్టించిన తాజమహలును చివరిఘడియలలో చూసుకొంటూ పోయాడట షాజహాను. అతడికి ఆ మధురస్వప్నసదృశమయిన ఆ మహాభవనంలో భార్యాస్మృతి అనే రసమయభావన మిళితమయి ఉన్నట్టే, చలమయ్యాపంతులుకు, తన బహుకాల శారీరకమానసిక పరిశ్రమలకు ఫలితమిదే అన్నతృప్తి ఆకట్టడంలోని ప్రతిస్వల్పభాగంలోను అంతర్లీనమయిఉంది. అంతే, ఆ తృప్తిలవము తప్పితే చలమయ్యాపంతులు తానెన్నడూ ఆ యింటిలో ఉండలేదు. అసలు అతనికి కొన్నికొన్ని సందర్భాలలో, ఎవరు ఇంటిని ఏవిధంగా ఉపయోగించినా, కష్టంగానే ఉండేది. కాని, అటువంటిమాట బైటికి స్పష్టంగా అంటే తనను పిచ్చివాడుగా జమకట్టేస్తారేమో నన్న సామాన్యజ్ఞానం మాత్రం అతన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. కాని లోపల్లోపలమాత్రం ఒక సుకుమారమయిన పుష్పాన్ని, రేకు లూడదీసి, నలిపి చిందరవందర చేస్తున్నట్లుండేది. తమఇంట్లో అద్దెకున్నవాళ్ల ప్రవర్తనచూస్తూ ఉంటే. ఏమయితేనేం ఆఖరి తురుపుముక్క చలమయ్యాపంతులుదే అయింది. తన కంఠంలో ప్రాణం ఉండగా తన స్వంతఇంటిమీది హక్కును పూర్తిగా వదులుకోలేదు.

* * * *

మొదట నాగురించి అంతగా చెప్పకొని, చివరికి తటస్థంగా ముభావంగా తప్పుకొంటే మీ రేమనుకొంటారు? నాకు, ఒక్కటే భయం—స్వంత ఇల్లు అంటూ లేకపోయినంతలో ఉండడానికి ఇళ్ళు లేకపోలేదు కదా. ఇక స్వంతము అన్న మమకారం పొడసూపిందంటే అది ఎంతవరకూ వ్యాపిస్తుందో? చివరికి, చలమయ్యాపంతులులాగ కేవలం అదొక కళాస్వరూపమయికూర్చొని, దానిని, కేవలం దేవాలయాలను, చిత్రప్రదర్శనాలను చూసినట్టుగా ఆనందించడమో, లేక లోకుల (అంటే ఇంట్లోవాళ్ళ) బాధపడలేక, అద్దెలకిచ్చి, అద్దెలవాళ్లు, ఇంటిని సరిగా, అంటే నామనసులో ఉన్న ప్రకారం ఉపయోగించుకోలేని, మార్దవరహితులని అనుకొని బాధపడేస్థితి నాకు చాలా భయంకరమయినదిగా రూపిస్తుంది. కాక స్వంతము అని ఒకవస్తువు ఉంటే, దాన్ని మనం ఉపయోగించుకొందికి అనర్హులమని అనుకొని, అన్యులకు ఉపయోగించుకొందికి ఇవ్వడంలో ఆర్థికలాభం ఎంత ఉంటున్నా, స్వార్థమయిన అనుభవకాంక్ష నన్ను విడిచిపెట్టదని నా అనుమానం. పోగా, ప్రస్తుతానికి చలమయ్యాపంతులును, ఇంకా అతనిలాగే, తాము ఉపయోగించుకొంటే, తమ ఆస్తిని కొలదిపరచి నట్లవుతుందన్న నమ్మకంతో, కేవలం ఇతరుల ఆనందంనిమిత్తం సర్వమూ సమకూర్చి భద్రపరచి, తమది అన్నస్వార్థం కోసం తమ అనుభవాలను త్యాగం చెయ్యగలిగిన కళాప్రియులను సంస్మరించుకొంటూ, "మళ్ళీ నెలలో మాతమ్ముడి కొడుకు కుటుంబంతో వస్తాడట. అందుచేత, మరి, చూసేరుకదూ, నాకు ఇష్టంలేదుగాని, మీరుమాత్రం ఖాళీచెయ్యవలసి ఉంటుంద"న్న గృహయజమాని, ఆదేశానుసారంగా నూతనగృహాన్వేషణార్థినై బయలుదేరుతున్నాను.